## క్లుప్తంగా

### నేడు డయల్ యువర్ డీఎం

రాజంపేట : ఆర్టీసీ డిపోలో నేడు బుధవారం డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు తమ అమూల్యమైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

### అభివృద్ధికి సహకరించండి

రాయచోటి టౌన్ : జిల్లా అభివృద్ధికి సహకరించాలని ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓ ఓబులమ్మకు రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయను నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆమె మంత్రిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఆయన ఆమెతో పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. జిల్లా అభివృద్ధి కోసం అందరం కలసి పని చేయాలని కోరారు.

### విద్యార్థులకు వైద్య పరీక్షలు

గాలివీడు : మండల కేంద్రమైన గాలివీడులోని వసతి గృహాలను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పీఎం రఫీక్, డాక్టర్ తేజస్వినీలు సందర్శించి అవసరమైన మందులను విద్యార్థులకు అందించి వ్యక్తిగత పరిశుభ్రత, జ్వరాల గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### కోడింగ్‌పై వర్క్‌షాప్

రామాపురం : భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో బిగినర్స్ కోడింగ్ బూట్ క్యాంప్, జీరో టు కోడ్ అనే శీర్షికతో మంగళవారం ఒక రోజు వర్క్‌షాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కడప కేఎస్ఆర్ఎం ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకటరమణ పాల్గొన్నారు. విద్యార్థులు కోడింగ్ ప్రపంచంలోకి అడుగు పెట్టడానికి ఉన్న అవకాశాలను తెలియజేశారు. ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లో వివిధ అంశాలను వివరించారు. కోడింగ్ సమస్యలను పరిష్కరించడానికి వివిధ పద్ధతులను చెప్పారు. ఈ ప్రత్యక్ష కార్యక్రమాలు విద్యార్థులకు కోడింగ్ ఆచరణాత్మక అనుభవాన్ని, నైపుణ్యాలను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమానికి మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో బిట్స్ కళాశాల యజమాని భాస్కర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాధ్యతల స్వీకరణ

లక్కిరెడ్డిపల్లి : మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉన్న ప్రసన్న లక్ష్మీ లక్కిరెడ్డిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. లక్కిరెడ్డిపల్లి మండలం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రాజేష్ బాధ్యతలు చేపట్టారు. రైతుల సమస్యలపై ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ పరిష్కారం దిశగా కృషి చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలియజేశారు.

### ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ ఎంపిక


సమావేశంలో పాల్గొన్న యూనియన్ సభ్యులు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని ఆటో, ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నూతన కమిటీని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల సంక్షేమం కోసం చర్యలు చేపట్టకుంటే దశలవారిగా ఉద్యమాలు చేస్తామన్నారు. ప్రజల దైనందిక జీవితంలో ఆటో డ్రైవర్లు ఎంతో బాధ్యత వహిస్తుంటారని, ప్రభుత్వాలు వారి సంక్షేమాన్ని కోరుకోవాలన్నారు. అధ్యక్షులుగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్ తదితరులను ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు.

### యూటీఎఫ్ కమిటీ ఎన్నిక

రాజంపేట టౌన్ : యూటీఎఫ్ మండలశాఖ నూతన కమిటీని స్థానిక ఉర్దూ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా పీఎల్‌వీ ప్రసాద్, అధ్యక్షుడిగా జి.నాగేంద్ర, ప్రధాన కార్యదర్శిగా కె.శివయ్య, కోశాధికారిగా కె.రామచంద్ర, ఉపాధ్యక్షులుగా పి.రవిచంద్రప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.తులసమ్మ, సీపీఎస్ కన్వీనర్‌గా కె.శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బిళ్ళా హరిప్రసాద్ తెలిపారు. అలాగే మండల కార్యదర్శులుగా డి.ఈశ్వర్‌రాజు, కె.నరసయ్య, ఎ.చంద్రయ్య, డి.వెంకటరమణ, యూ.అరుణాదేవి, జి.భాగ్యలక్ష్మీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా కౌన్సిలర్లుగా ఎం.నాగేశ్వర్‌గౌడ్, డి.చెంగల్‌రాజు, పి.వెంకటసుబ్బయ్య, బి.హరినాథ్, ఎం.నాగభూషణంరాజు, ఎం.వెంకటరమణ, ఆర్.సుబ్రమణ్యం, ఆర్.రెడ్డమ్మ, పి.కవిత, పి.మంజులవాణిలను ఎన్నుకున్నట్లు తెలియజేశారు.

**రైల్వేకోడూరులో..**

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు యూటీఎఫ్ కార్యాలయంలో గౌరవ అధ్యక్షులు లక్ష్మీకర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా రామమూర్తి, కోశాధికారిగా నరసింహులు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫణీంద్ర ప్రసాద్, శివశంకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, అశోక్, శారద తదితరులు పాల్గొన్నారు.

# వెన్న శాతం పెరుగుదలతో లాభాలు

- పోషకాలు ఉన్న దాణాతోనే వెన్నశాతం పెరుగుదల
- పశువుల కొట్టాలు, షెడ్లలో పరిశుభ్రత తప్పనిసరి
- నెమ్మదిగా పాలు పితికితే వెన్నశాతం తగ్గుతుంది


పాలు పితుకుతున్న మహిళా పాడి రైతు

సిద్దవటం : వ్యవసాయంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పాడి పరిశ్రమ రైతులను ఆదుకుంటుంది. ఒక పాడి గేదె ఒక ఎకరం పొలంతో సమానమని రైతన్నలు చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు పోయినా చాలా మంది రైతులకు పాడి పరిశ్రమ ఆసరాగా నిలుస్తోంది. పాడి పరిశ్రమ వైపు యువత మక్కువ చూపుతోంది. ప్రస్తుతం మండలంలో 4వేల పాడిపశువులు ఉన్నాయి. నాణ్యమైన పాలకు మంచి ధర ఉంది. పాలలో వెన్న శాతాన్ని బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. పోషకాలు సంవృద్ధిగా ఉన్న దాణాతోనే పాలలో వెన్న శాతం పెరుగుతుందని సిద్దవటం పశువైద్యశాల అసిస్టెంటు డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీదేవి రైతులకు వివరిస్తున్నారు. పాలలో వెన్న శాతం పెరగాలంటే తగు జాగ్రతలు తీసుకుంటూ, సలహాలు, సూచనలు పాటించాలని అంటున్నారు. పాడి పశువుల్లో వెన్న శాతం జన్యు పరంగా సామర్థ్యం, జాతి వయస్సు, పాడి కాలం, ఈతల సంఖ్య, పాల దుగుబడి, ఆహారం, వాతావరణం తదితర అంశాలపై అధార పడి ఉంటుంది.

**పరిశుభ్రత ముఖ్యం**

పాలు పితికే ముందు పశువుల కొట్టాలను, గదులను, షెడ్లను తప్పనిసరిగా శుభ్రం చేయాలి. అలాగే పశువుల శరీరాన్ని, అందులో ప్రధానంగా పొదుగును శుభ్రంగా కడిగి శుభ్రమైన పొడి గుడ్డతో తుడవాలి. అలా చేయకపోతే పొదుగుకు అతుక్కున్న పేడ, మురికి, మలినాలు పాలలో కలిసి కలుషితమయ్యే ప్రమాదం ఉంది. పాలు పితికే పాత్ర శుభ్రంగా ఉండాలి. వాటిని సోడా కలిపిన వేడి నీటితో కడగాలి. తరువాత పాత్రను పరిశుభ్రమైన ప్రదేశంలో ఆరబెట్టాలి. పాలు పితికే మనిషి చేతులకు ఉన్న గోర్లు కత్తిరించుకోవాలి. తడి చేతులతో పాలు పితకవద్దు. తడి చేతులతో పాలు పితకడం వలన పొదుగు పొరలు పొరలుగా పగుళ్లు వచ్చే అవకాశం ఉంది. పొదుగును చేతి నిండుగా పట్టుకుని పితకాలి. పాలు సాధ్యమైనంత తొందరగా పితకాలి. అంటే 7, 8 నిమిషాల్లో పాలు పితకడం పూర్తి చేయాలి. పాలు పితికేటప్పుడు కుక్కలు, పిల్లలు అరవ కుండా జాగ్రతపడాలి. లేకుంటే పశువులు బెదిరే అవకాశం ఉంటుంది. పాలు పితికిన తరువాత పరిశుభ్రమైన గుడ్డతో వడపోసి, పాలు అమ్మే వరకు చల్లని ప్రదేశంలో ఉంచాలి.

**గేదె పాలలోనే వెన్న శాతం ఎక్కువ**

ఆవుల్లో కంటే గేదెలోని పాలల్లో వెన్నశాతం ఎక్కువగా ఉంటుంది. సంకర జాతి పశువుల్లో పాల దిగుబడి ఎక్కువగా ఉన్నప్పటికీ దేశీయ పశువుల్లో వెన్నశాతం అధికంగా ఉంటుంది. పశువుల ఈత పెరిగిన కొద్దీ వెన్నశాతం తగ్గుతుంది. ఈనిన 3 – 5 రోజుల్లో వెన్నశాతం ఎక్కువగా ఉంటుంది. ఆ తరువాత రెండు, మూడు నెలల వరకు పాల దిగుబడి పెరుగుతూ వెన్నశాతం తగ్గుతుంది. ఈత చివరి 8 నెలల సమయంలో పాల దిగుబడి తగ్గి, వెన్నశాతం పెరగడాన్ని రైతులు గమనించాలి. సాధారణంగా పాడి కాలం పెరిగే కొద్ది వారానికి 2.5 శాతం చొప్పున పాల దిగుబడి తగ్గుతుంది. వెన్నశాతం మాత్రం పెరుగుతుంది. వాతావరణంలో ఉష్ణోగ్రతలో 10 డిగ్రీల ఫారన్ హీట్ ఎక్కువైతే 0.1 నుంచి 0.2 శాతం తగ్గుతుంది. అందువల్ల వేసవి కాలం కంటే చలి కాలంలోనే వెన్నశాతం ఎక్కువగా ఉంటుంది. 2 నుంచి 3 కిలో మీటర్లు తిరిగి మేసి వచ్చే పాడి పశువుల్లో వెన్నశాతం ఎక్కువగా ఉంటోంది. చాలా దూరం తిరిగి తీవ్ర బడలికకు గురైతే మాత్రం వెన్న శాతం తగ్గుతుంది. పాలు పితకడం కూడా వెన్నపై ఆధారపడి ఉంటుంది. నెమ్మదిగా పితికినా, పూర్తిగా పాలు పితకక పోయినా పాల దిగుబడి, వెన్నశాతం తగ్గుతుంది. ముందు పితికిన పాలలో కన్నా వెనుక పితికిన పాలలో వెన్నశాతం ఎక్కువగా ఉంటుంది. పాలలో నీళ్ల కలిపినా పచ్చగడి ఎక్కువగా మేసినా, మేత మారినా, వెన్నశాతం తగ్గుతుంది.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

కొన్ని జాగ్రతలు తీసుకున్నట్లయితే పాలలో వెన్న శాతం పెంచుకోవచ్చు. పశుగ్రాసాన్ని అంగుళంలో 1/4కంటే చిన్న ముక్కలుగా చేసి మేపడం వల్ల వెన్న శాతం తగ్గుతుంది. గ్రాసం అంగుళంలోపు కత్తిరించి మేపడం సరికాదు. పాడి పశువులకు రోజు 30 కిలోల పచ్చిమేత, 10కిలోల ఎండుమేత వేయాలి. పచ్చిమేతకు 15 కిలోల మొక్కజొన్న, జొన్న, సజ్జ గడ్డికలిపిన మిశ్రమ ఆహారం అందించాలి. 5కిలోల అలసంద, పెసర, మినుము పంట మేతగా వేయాలి. 5 లీటర్లకన్నా అదనంగా పాలు ఇచ్చే పశువుకు అదనపు మేత ఖనిజ లవణాలు, పోషకాలు ఉన్న దాణా ఇవ్వాలి. ప్రతి రెండు లీటర్ల పాలిచ్చే పశువులకు ఒక కిలో దాణా అదనంగా ఇస్తే వెన్నశాతం పెరుగుతుంది.

**నీళ్లు కలిపితే వెన్న శాతం తగ్గుతుంది**



ఆవు పాలలో కంటే గేదె పాలలోనే వెన్న శాతం ఎక్కువగా ఉంటుంది. పాలలో నీళ్లు కలిపితే వెన్న శాతం తగ్గుతుంది. పాలను నెమ్మదిగా పితికితే కూడా వెన్నశాతం తగ్గుతుంది. కాబట్టి వీలైనంత త్వరగా పాలను పిండాలి. పాడి పశువుల పెంపకంలో మంచి యాజమాన్య పద్ధతులు పాటించి పోషణలో తగు జాగ్రతలు తీసుకున్నట్లయితే పాలలో వెన్న శాతం పెంచుకొని పాడి రైతులు అధిక లాభాలను పొందుతారు.

– డాక్టర్ లక్ష్మీదేవి, పశుసంవర్ధక శాఖ అసిస్టెంటు డైరెక్టర్, సిద్దవటం

### పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి


లెక్చరర్‌ను సన్మానిస్తున్న బెటాలియన్ అధికారులు

సిద్దవటం : ప్రజల కోసం, ప్రభుత్వ ఆస్తుల కోసం ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు అమరులను మరువలేమని వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ లెక్చరర్ బి.గంగాధర్ తెలిపారు. మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సెమినార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగాధర్ ముఖ్య అతిథిగా విచ్చేసి పోలీసుల నిస్వార్థ సేవలు, వారి త్యాగాలపై ప్రసంగించారు. అనంతరం లెక్చరర్ గంగాధర్‌ను అసిస్టెంట్ కమాండెంట్‌లు థియోఫిలాస, విల్సన్‌కేర్‌లు శాలువా కప్పి మెమెంటోను అందజేసి ఘనంగా సత్కరించారు.

### సిస్టర్ నివేదితకు ఘన నివాళి

రాయచోటి టౌన్ : స్వాతంత్ర్య సమరయోధురాలు సిస్టర్ నివేదిత నేటి తరం మహిళలకు ఆదర్శప్రాయురాలని ఆపస్ జిల్లా అధ్యక్షులు నరసింహులు అన్నారు. మంగళవారం ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆమె పుట్టింది అమెరికాలో అయినా స్వామి వివేకానందుడి బోధనలకు ఆకర్షితురాలై భారతీయతను స్వీకరించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొందని చెప్పారు. ప్లేగ్ రోగులకు ఆమె సేవ చేశారన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు.

## ప్రతి దుకాణదారు నిబంధనలు పాటించాలి


సిద్దవటం: సూచనలు చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు


ఓబులవారిపల్లె: దుకాణాలను పరిశీలిస్తున్న ఎస్ఐ

సిద్దవటం : దీపావళికి టపాసులు అమ్మే ప్రతి దుకాణదారుడు నిబంధనలను పాటించాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌లో మంగళవారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో దీపావళి పండుగను పురస్కరించుకొని టపాసుల అంగళ్లను ఏర్పాటు చేసుకునేందుకు పర్మిషన్ కొరకు అప్లయి చేసుకున్న యజమానులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ షాపులను నివాస గృహాలకు, ఆసుపత్రులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. టపాసుల స్టాల్స్ దగ్గర ప్రతి ఒక్కరూ భద్రత చర్యలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన సిద్దవటం పోలీసు స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ కృష్ణరాజునాయక్, సిద్దవటం, ఎస్ఐ చిరంజీవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**జాగ్రత్తలు పాటించండి**

ఓబులవారిపల్లె : దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ పి.మహేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం మంగంపేట గ్రామాలలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తీసుకోవాల్సిన చర్యలు గురించి సూచనలు, సలహాలు ఇచ్చారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రాప్ ఇన్సూరెన్సును సద్వినియోగం చేసుకోవాలి


సుండుపల్లి: రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయ అధికారులు


రాజంపేట రూరల్: రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీఎస్ శాస్త్రవేత్త శ్రీవల్లి

సుండుపల్లె : మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీలోని వాయులవడ్డు బిడికిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బి.చంద్ర నాయక్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వివిధ పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య చర్యలు గురించి వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయం గురించి క్లుప్తంగా తెలియజేశారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో క్రాప్‌లోన్ తీసుకున్న ప్రతి ఒక రైతు ఆయా పంటలకు క్రాప్ ఇన్సూరెన్సు తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలని కోరారు. క్రాప్ లోన్ తీసుకోని రైతులకు కామన్ సర్వీస్ సెంటర్, మీసేవ, ఆర్ఎస్కే కేంద్రాలలో దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మహబూబ్ బాషా, అగ్రికల్చర్ ఆఫీసర్ రమేష్ రాజు, ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ రాము, క్లస్టర్ ఇన్‌చార్జ్ ఆంజనేయులు, రామ్మోహన్, ఐసీఆర్‌పీ రామాంజులు, వీర నాగయ్య, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్ ఎం.రెడ్డి నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలి**

రాజంపేట రూరల్ : వ్యవసాయ సాగుకు రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసుకోవాలని కేవీఎస్ సైంటిస్ట్ శ్రీవల్లి కోరారు. మండల పరిధిలోని గుండ్లూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా వరి వంగడాల గురించి వివరించారు. నారుమడి పెంపకంలో అనువైన బీపీటీ-5204, కేఎస్ఎం-1638 రకాల గురించి అవగాహన కల్పించారు. వరితోపాటు దాన్యాలు, నువ్వులు వంటి పంటల సాగు చేపట్టాలని సూచించారు. కడపలోని ఊటుకూరు కేవీకేలో యుపీఆర్-181 వరి రకం కలదని ఆసక్తిగల రైతులు కొనుగోలు చేసుకోవాలని కోరారు. పరిచయంలేని వాళ్లు, అదే విధంగా కొత్తవాళ్ల దగ్గర విత్తనాలు కొనుగోలు చేయరాదని తెలియజేశారు. రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గుజ్జల రాజకుమారీ, రైతులు పాల్గొన్నారు.

**రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి**

రైల్వేకోడూరు అర్బన్ : రైతులు నిర్వహించే వ్యవసాయంలో పంటలపై తగిన జాగ్రత్తలు తీసుకున్నప్పుడు మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ ఏడీ కవిత తెలిపారు. రబీ సీజన్‌లో రైతులకు టమాటా, పూలసాగు, మామిడి పంటలపై అవగాహన కల్పించారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పంటలపై అవగాహన కల్పించినట్లు ఏడీ కవిత తెలిపారు.

## దళితులకు నివాస స్థలాలు కేటాయించాలి


స్థలాలను పరిశీలిస్తున్న ఈశ్వరయ్య, నాయకులు

రామాపురం : సుద్దమళ్ల గ్రామం పరిధిలోని ఎగువ హరిజనవాడ దళితులకు 1994 నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంజూరు చేసిన నివాస స్థలాల పట్టాలకు స్థలాలు సూచించాలని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. సుద్దమళ్ల గ్రామంలో సర్వేనెంబరు 374/2లోని భూమిని దళితులతో కలిసి పరిశీలించారు. మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధించి 77 ఏళ్లు పూర్తయిన దళితులు చనిపోతే పూడ్చుకోవడానికి స్థలం లేని దీనస్థితిలో జీవిస్తున్నారన్నారు. పేద దళితులను గుర్తించి 1994లో అప్పటి సీఎం నందమూరి తారక రామారావు 50 కుటుంబాల దళితులకు నివాస స్థలాలు కేటాయించారు. కానీ నేటికి దళితులకు భూమి కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. భూములు కేటాయించని పక్షంలో పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి పి.మహేష్, నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మత్రి సుమిత్ర, నాయకురాలు సుబ్బమ్మ, ప్రమీళ, సీపీఐ నాయకులు ఓబులేసు, ప్రజలు పాల్గొన్నారు.

### ఉచిత బస్సు ప్రయాణం అమలెప్పుడు బాబు?

రైల్వేకోడూరు అర్బన్ : ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం పథకం అమలు ఇంకెప్పుడు ప్రారంభిస్తారంటూ బీకేఎంయూ నియోజకవర్గ నాయకులు జయరామయ్య మంగళవారం ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఆ సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామన్న ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ ఊసే ఎత్తలేదని వారు విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.వినయ్, వెంకటరమణ, రమణయ్య, వెంకటేశు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పథకంలో అక్రమాలను ఉపేక్షించబోం

ఒంటిమిట్ట : ఉపాధిహామీ పథకంలో అక్రమాలు జరిగితే ఉపేక్షించబోమని డ్వామా అడిషనల్ పీడీ సి.నాగరత్నమ్మ హెచ్చరించారు. మంగళవారం స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద 19వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డ్వామా అడిషనల్ పీడీ హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతి పేదవారికి ఉపాధి కల్పించడమే ఈ పథకం ఉద్దేశమన్నారు. అలాగే రైతులు ఈ పథకంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెలాఖరు వరకు జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీలో దాదాపు రూ. 7 వేల నుంచి రూ. 8 వేలు వరకు కూలీలకు అదనంగా చెల్లించారని, సిబ్బంది నుంచి పైన తెలిపిన నగదును రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ సోమశేఖర్ రెడ్డి, విజయభాస్కర్, ఎంపీడీఓ సోమశేఖర్, ఎస్ఆర్‌పీ కన్నారెడ్డి, ఏపీఓ శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇచ్చిన హామీలను నిలుపుకోండి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, నాయకులు

సంబేపల్లె : మండల కేంద్రంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ, నిరసన ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇంత వరకు విద్యార్థులకు ఇచ్చిన హామీల ఊసే లేదన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లపై చేసిన వాగ్దానాలను అమలు చేయాన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన అమలు చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, హాస్టళ్లకు సొంత భవనాలు, అధ్యాపక పోస్టుల భర్తీ చేయాలన్నారు. అలానే జీఓ నెంబర్ 77ను రద్దుచేసి పీజీ చదివే విద్యార్థులందరికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటు పరం చేయవద్దంటూ డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

## జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


ఎం.రెడ్డి కావ్యశ్రీ


మెమెంటో అందుకున్న మద్దిలేటి స్వామి

వీరబల్లి : రాయచోటిలో మంగళవారం ప్రభుత్వ కళాశాల మైదానంలో అండర్-17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఎం.రెడ్డి కావ్యశ్రీ జాతీయస్థాయికి ఎంపికైనట్లు పీడీ శేఖర్ తెలిపారు. రెడ్డి కావ్యశ్రీ మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతోంది. రాష్ట్రస్థాయి పోటీలలో తన ప్రతిభను కనబరిచి కబడ్డీ పోటీలలో జాతీయస్థాయికి ఎంపికై నట్లు పీడీ తెలియజేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

**సత్తాచాటిన కోడూరు విద్యార్థి**

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని హెచ్ఎంఎం ఉన్నత పాఠశాల విద్యార్థి మద్దిలేటి స్వామి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు మంగళవారం ఎంపికయ్యారు. రాయచోటిలో జరిగిన కబడ్డీ పోటీలలో స్వామి ఎంపికయ్యారు. రాయచోటిలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అరుణ్ కుమార్ చేతులమీదుగా మెమెంటో అందుకున్నారు. పలువురు స్వామిని అభినందించారు. కార్యక్రమంలో ఐపీఈ భానుమూర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ సేవలకు పురస్కారాలు


మంత్రితో అవార్డులు అందుకున్న మున్సిపల్ కమిషనర్, మెప్మా అధికారులు

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపల్ అధికారులు అందించిన ఉత్తమ సేవలకు పురస్కారాలు దక్కాయి. విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, మెప్మా పట్టణ అధికారి అబ్బాస్‌అలీఖాన్ అవార్డులు అందుకున్నారు. మున్సిపల్ పరిధిలో వీధివిక్రయదారులకు రుణాలు ఇప్పించడం, కనీస వసతులు కల్పించడంలో ఉత్తమ సేవలు అందించినందుకు పీఎం స్వనిధి పథకం కింద రాయచోటి మున్సిపాలిటీకి రెండు అవార్డులు దక్కాయి. ఇందులో ఒకటి జాతీయ, మరొకటి రాష్ట్రస్థాయి అవార్డు. వీటిని మంత్రి నారాయణ వారికి అందజేశారు.

## విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలి


విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న డిప్యూటీ డీఈఓ

వీరబల్లి : విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని డిప్యూటీ డీఈఓ శివప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శక్తిసామర్థ్యాలను పెంపొందించాలన్నారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థుల పట్ల శ్రద్ధ కనబరిచి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ఆధార్‌లో ఎటువంటి తప్పులు లేకుండా అప్‌డేట్ చేయాలన్నారు. ప్రస్తుతం వీరబల్లిలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో సమస్యగా ఉందని ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్ సెంటర్‌ను ప్రత్యేకంగా విద్యార్థుల కోసం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. మధ్యాహ్నం భోజనం మెనూను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ సూచనల మేరకు విద్యార్థులకు మంచి భోజనం అందించాలన్నారు.

## రీ సర్వే సమస్యలను తెలియజేయండి


చిన్నమండెం: గ్రామసభలో పాల్గొన్న అధికారులు

రామాపురం : మండల పరిధి నీలకంఠ్రావుపేట రెవెన్యూ గ్రామ పరిధిలో రీ సర్వే సమస్యలు ఉన్నవారు గ్రామ సభ దృష్టికి తీసుకురావాలని మండల తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం నీలకంఠ్రావుపేటలో రీ సర్వేపై గ్రామ సభలో మాట్లాడుతూ నీలకంఠ్రావుపేటలో 1644.18 ఎకరాలు రీ సర్వే జరిగిందన్నారు. భూమి కొలతల్లో తేడాలు వచ్చి ఉన్నా, ఒకరి భూమి మరొకరికి మారి ఉన్న పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మహబూబ్‌బాషా, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ శశికళ, ఆర్ఐ, వీఆర్‌ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు**

సిద్దవటం : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. సిద్దవటం మండలం జంగాలపల్లెలో మంగళవారం రెవెన్యూ సదస్సులు, గ్రామ సభను నిర్వహించారు. పలు సమస్యలపై రైతులు తహసీల్దారుకు అర్జీలు సమర్పించారు. ఆయా అర్జీలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దారు అన్నారు. కార్యక్రమంలో వీఆర్ఓ కేశవులు, సచివాయాల సర్వేయర్‌లు పురుషోత్తంరెడ్డి, పవన్, నరేష్, ఖాజామొహిద్దీన్, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకుడు రాజానాయుడు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

**కొత్తపల్లిలో గ్రామసభ**

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో రీ సర్వేపైన మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేలో ఏర్పడ్డ భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ గ్రామసభలను ఏర్పాటు చేసిందన్నారు. బాధిత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 52 అర్జీలను బాధిత రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించారు.

### పెన్నానదిలో దూకి యువతి ఆత్మహత్య?


సంగటి సునీత(ఫైల్)

సిద్దవటం: సిద్దవటంలోని పెన్నానదిలో మంగళవారం సంగటి సునీత(19) దూకి అదృశ్యమైంది. స్థానికుల కథనం మేరకు.. సిద్దవటం ఎగువపేట అరుంధతీవాడకు చెందిన సంగటి పెంచలమ్మ కూతురు సునీత ఆత్మహత్య చేసుకునేందుకు శివాలయం వద్ద పెన్నానదికి వెళ్లింది. అక్కడ అయ్యప్పస్వామి మాల ధరించిన భక్తులు చూసి ఆమెను అక్కడి నుంచి పంపేశారు. అనంతరం సిద్దవటం కాజ్‌వే వద్ద ఆమె అన్న సునీతను చూసి ఎక్కడికి వెళ్తున్నావంటూ వెంటపడడంతో ఆమె పరుగు తీసింది. అనంతరం సునీత కనిపించక పోవడంతో నదిలో దూకి అదృశ్యమైందని అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది గాలించినా సునీత కనిపించలేదు. వివరాలు తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోండి

సిద్దవటం : చేనేత కార్మికులు ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని వీవర్స్ హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఒంగోలు రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ వి.భీమయ్య తెలిపారు. సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీ, పార్వతీపురం గ్రామంలోని శ్రీ నాగమల్లిక వీవర్స్ కో-ఆపరేటీవ్ ప్రొడక్షన్ అండ్ సెల్స్ సొసైటీ లిమిటెడ్ ప్రెసిడెంట్ ఎం.డి.మల్లికార్జున ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు ప్రభుత్వ రాయితీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వారు సాధారణ చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ వారికి 500 యూనిట్లు వరకు ఉచితంగా కరెంటు, హెచ్ఐఎస్ స్కీమ్, త్రిఫ్ట్ ఫండ్, ఆర్ఎంఎస్ఎస్ 15 శాతం సబ్సిడీతో కూడిన సంఘాల పునరుజ్జీవన గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కడప ఏడీ పిచ్చేశ్వర్‌రావు, ఏడీఓలు రవిప్రకాష్‌రెడ్డి, వనిత, సుబ్బరాయుడు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

### అన్నదానం మహాదానం


అన్నదానం నిర్వహిస్తున్న మాదం సుబ్రమణ్యం

ఒంటిమిట్ట : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని దాత మాదం సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం ఒంటిమిట్ట చెరువు కట్టపై వెలసిన ఆంజనేయస్వామి దేవాలయం వద్ద కమిటీ సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాదం సుబ్రమణ్యం అన్నదానం నిర్వహించారు.